క్లుప్తంగా

చవితి రాట మహోత్సవం



రాట మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి, తదితరులు

జగదాంబ: వినయక చవితి పురస్కరించుకుని జీవీఎంసీ 35వ వార్డు పండావీధిలో గురువారం రాట వేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చవితి ఉత్సవ ఏర్పాట్లపై సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వేశ్వరరెడ్డి, వెంకటరమణరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల వసతి గృహానికి ముగ్గురి తరలింపు



భీమ్‌నగర్ వసతి గృహంలో చేర్పించిన యాచకులతో సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శ్రీకారం చుట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా యాచకులు, ఇంటి నుంచి తప్పిపోయిన, మతిస్థిమితం లేని 73 మంది తమ ఆధీనంలోని పునరావాస కేంద్రాల్లో ఉన్నట్టు కమిషనర్ తెలిపారు. పోలీస్ కమిషనరేట్ ప్రాంతంలో ముగ్గురు యాచకులు ఉన్నట్టు డీసీపీ అజిత వేజెండ్ల సమాచారం అందించడంతో గురువారం ఉదయం టూ టౌన్ సీఐ ఎర్రంనాయుడు, ఎస్ఐ సతీష్, హెడ్ కానిస్టేబుల్ కొండ, కన్నారావు అక్కడికి చేరుకుని వారికి భీమనగర్‌లోని పురుషుల నిరాశ్రయుల వసతి గృహంలో ఆశ్రయం కల్పించినట్లు తెలిపారు.

23 నుంచి కళాభారతిలో సంగీత నృత్యోత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ప్రతినిధులు

మద్దిలపాలెం: కళలకు నెలవైన కళాభారతి ప్రాంగణంలో ఈ నెల 23 నుంచి 28 వరకు ఆరు రోజుల పాటు సంగీత, నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్ రాజు, రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం కళాభారతి ఆడిటోరియంలో ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో అకాడమీ కోశాధికారి పైడా కృష్ణ ప్రసాద్, గ్రంధి మల్లికా మనోజ్ పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. అనంతరం, 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

బీచ్‌రోడ్డు: బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూర్ణా మార్కెట్ ప్రాంతానికి చెందిన కె.సాగర్ (26) స్నేహితుడితో కలిసి పార్క్ హోటల్ నుంచి ఆర్కే బీచ్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ముందు బైక్‌పై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో ఆ వాహనాన్ని సాగర్ ఢీకొట్టి కింద పడిపోయాడు. హెల్మెట్ లేకపోవడంతో సాగర్ తలకు తీవ్రగాయమై చికిత్స పొందుతూ గంట వ్యవధిలోనే మరణించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కనెక్షన్లు కలిపేదెప్పుడో..?

- స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా పాతనగరంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ పనుల పూర్తి
- ఎక్కడికక్కడ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు
- వాటి నుంచి ఇళ్లకు నేటికీ కనెక్షన్లు ఇవ్వని అధికారులు
- మరోవైపు వీధుల్లో ప్రమాదకరంగా వేలాడుతున్న వైర్లు



స్టేడియం రోడ్డులో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



వెలంపేట వద్ద కనెక్షన్లు ఇవ్వకుండా వదిలేసిన కేబుల్ బాక్స్

జగదాంబ: స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా పాతనగరంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ పనులు పూర్తయినప్పటికీ వాటి ఫలాలు మాత్రం స్థానికులకు అందడం లేదు. అసలే పాతనగరంలో చిన్న చిన్న రోడ్లు.., ఆపై ఇరుకు సందులు.. ఒక మనిషి ఎదురుగా వస్తే ఇంకొకరు తప్పించుకుని రాలేని పరిస్థితి.. ఇటువంటి రోడ్లలో అండర్ గ్రౌండ్ ఎలక్ట్రికల్ కేబుల్ వ్యవస్థ పనులు పూర్తయినా నేటికీ వాటి నుంచి ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వలేదు. ఫలితంగా వీధుల్లోని విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. దీంతో ఆ స్తంభాలకున్న వైర్లు మృత్యు తీగల్లా వేలాడుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా విద్యుత్ తీగలు ఎలక్ట్రికల్ పోల్స్ (స్తంభాలు) పైనుంచి కాకుండా భూమిలో నుంచి ఏర్పాటు చేయాలని పాతనగరంలో అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ పనులు కొద్ది సంవత్సరాల కిందట చేపట్టారు. యాభై అడుగుల దూరానికో ట్రాన్స్‌ఫార్మర్, సమీపంలోనే ఎలక్ట్రికల్ బాక్స్‌లు ఏర్పాటు చేశారు. మొదటి విడతలో భాగంగా పాతనగరంలో చేపట్టిన ఈ పనులన్నీ పూర్తయిపోయాయి. అయితే ఇక్కడి నుంచే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పనులు పూర్తి చేసేందుకు చూపించిన శ్రద్ధ ఇళ్లలోని విద్యుత్ లైన్లకు కనెక్షన్లు ఇవ్వడంలో చూపించడం లేదు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్ని చోట్ల ట్రయల్ రన్ కింద పెద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్లు ఇచ్చారు. అవి సఫలమైన తర్వాత వాటిని అలాగే వదిలేశారు. కానీ వీధుల్లో ఏర్పాటు చేసిన కేబుల్ లైన్ల నుంచి మాత్రం సంవత్సరాలు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. దీంతో స్థానికుల ఇళ్లకు అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ నుంచి విద్యుత్ సరఫరా జరగడం లేదు.

చేతికి అందే ఎత్తులో వైర్లు

వన్‌టౌన్ పరిధిలో అల్లిపురం, పూర్ణామార్కెట్, కోటవీధి, చిలకవీధి, జగదాంబ, చెంగలరావుపేటలోని అన్ని వీధుల్లో విద్యుత్ స్తంభాలపై వేలాడుతున్న విద్యుత్ వైర్లు ప్రజలను భయభ్రాంతులను చేస్తున్నాయి. ఒక మనిషి నిలబడి చేయి ఎత్తితే అందేంత ఎత్తులోనే విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. కొన్ని చోట్ల ఇళ్ల మీద నుంచి లైను వెళ్లడంతో చిన్నారులు, మహిళలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటనలూ ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి భూగర్భ కేబుల్ వ్యవస్థ నుంచి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని... వీధుల్లోని విద్యుత్ స్తంభాలు, వైర్లు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



దుర్గమాంబ సమాజం వద్ద ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు



పండావీధిలో ఇళ్ల మధ్యలో విద్యుత్ స్తంభం

బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం



నిత్యం ప్రమాదకర పరిస్థితుల మధ్య బతుకుతున్నాం. కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఎప్పుడు తెగిపడిపోతాయోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నాం. అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ నుంచి ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చి తమను ప్రమాదాల నుంచి కాపాడండి.

– లక్ష్మి, దుర్గమాంబ సమాజం, 35వ వార్డు

అలంకారప్రాయంగా ట్రాన్స్‌ఫార్మర్లు



స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా ఏర్పాటు చేసిన అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ, ట్రాన్స్‌ఫార్మర్లు అలంకార ప్రాయంగా మిగిలాయి. అధికారులు స్పందించి భూగర్భ కేబుల్ వ్యవస్థ నుంచి ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలి. వీధుల్లోని విద్యుత్ స్తంభాలను, కేబుల్ వైర్లను తొలగించాలి.

– అరుణ్, బౌడారా రోడ్డు, 35వ వార్డు

రేణుక యల్లమ్మ ఆలయంలో పూజలు



అన్నసమారాధన చేస్తున్న ద్రోణంరాజు శ్రీవత్సవ్

అల్లిపురం: అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనని, అమ్మవారి దయ అందరిపై ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ అన్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ ఆలయంలో అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు. ఆలయం ఆవరణలో జరిగిన అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని వస్త్రదానం, అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలారావు, ముఖ్య సలహాదారు బొడ్డేటి ప్రసాద్, కోశాధికారి దున్నబోయిన సత్యనారాయణ, కొడమంచిలి శ్రీను, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిరాశ్రయ మహిళకు మానసిక చికిత్స



శాంతాదేవిని మానసిక వైద్యశాలలో చేర్పించిన కేర్ టేకర్ లీలావతి

అల్లిపురం: ఏయూటీడీ ఆధ్వర్యంలో టీఎస్సార్ కాంప్లెక్స్‌లో నడుస్తున్న మహిళల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న ఓ మహిళలను చికిత్స నిమిత్తం ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఈ నెల 14న 'మిషన్ తమసోమా జ్యోతిర్గమయ'పేరిట నిర్వహించిన కార్యక్రమంలో శాంతాదేవి(55)ని రెస్క్యూ చేశారు. పేరు తప్ప ఏమి చెప్పలేక పోవటంతో ఆమెకు ఏయూటీడీ కార్యదర్శి పి.వాసుకు అప్పగించారు. ఆమె మానసిక పరిస్థితి బాగాలేనందున, మూడు రోజులుగా అరిచి గొడవ చేస్తుండటంతో చికిత్స నిమిత్తం మానసిక ఆస్పత్రిలో గురువారం చేర్పించినట్లు ఏయూటీడీ కేర్ టేకర్ లీలావతి తెలిపారు.

మనవడికి వృద్ధురాలి అప్పగింత



వృద్ధురాలిని మనవడికి అప్పగిస్తున్న ఆశ్రమ నిర్వాహకురాలు మమత

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ చేపట్టిన జ్యోతిర్గమయ కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. నగరంలో యాచకులుగా తిరుగుతున్న వారిని రెస్క్యూ చేయటంతో వారి మూలాలు బయటపడుతున్నాయి. వన్‌టౌన్ ప్రాంతంలో జామి లక్ష్మి అనే వృద్ధురాలు పాదానికి ఇన్‌ఫెక్షన్ అయ్యి వర్షంలో తడుస్తుండగా సీపీ శంఖబ్రత బాగ్చి గుర్తించారు. ఆమెను వన్‌టౌన్ పోలీసుల సాయంతో మాతృప్రేమ వృద్ధాశ్రమానికి పంపించారు. ఆశ్రమ నిర్వాహకురాలు మమత ఆమెకు సపర్యలు చేసి, ఆశ్రయమిచ్చారు. వివరాలు ఆరా తీసి, విజయనగరం జిల్లా నరవలో ఉంటున్న ఆమె మనవడు రాయి మోహన్‌ను ఆశ్రమానికి పిలిపించారు. కంచరపాలెం పోలీసుల సమక్షంలో లక్ష్మమ్మను మనవడికి గురువారం అప్పగించారు.

కూటమి మోసాలపై ఇంటింటా ప్రచారం



ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు రమేష్, తదితరులు



మౌలాలిపంజా వీధిలో ప్రచారం చేస్తున్న వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్, తదితరులు

అల్లిపురం: నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాలతో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని 33వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గౌరీవీధి బూత్ నెం.65 పరిధిలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో.. వివరించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పచ్చరపల్లి రాము, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, పార్టీ నేతలు సలాది భాను, లక్ష్మీకాంతం, కొల్లు సత్యవతి, కృష్ణారెడ్డి, బాడుగుల శ్రీనివాసరావు, పీవీఎన్ రెడ్డి, ధర్మ, చోడిపల్లి శివకుమార్, పాల దామోదర్ రెడ్డి, సంతోష్‌కుమార్, అప్పయ్యమ్మ, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జగదాంబ: జీవీఎంసీ 39వ వార్డులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీపై కార్యక్రమంలో భాగంగా వార్డు అధ్యక్షుడు ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. మౌలాలిపంజా వీధిలో కార్యకర్తలతో కలసి కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో వైఫల్యాలను తెలిపారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుని తంచనుగా సంక్షేమ లబ్ధి పొందాలని సూచించారు. పార్టీ సౌత్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముహ్మద్ యాసీన్‌బాబ్జి, కురుపాం మార్కెట్ చైర్మన్ కృష్ణ, సత్య, షిలార్, రాజేష్, మాధురి, ధనరాజ్, ప్రసాద్, నూకరత్నం, సలీం, ఇబ్రహీం, వెంకటి, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ జన్యు పరీక్షల కేంద్రం ఏర్పాటు చర్యలు అభినందనీయం

చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం

మహారాణిపేట: సికిల్‌సెల్ ఎనీమియాతో బాధపడుతున్న గిరిజన పిల్లలు, పెద్దల జన్యు పరీక్షలు, వ్యాధి స్థాయి అంచనాకు కేంద్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ రూ.4 కోట్లతో కేజీహెచ్‌లో సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ ఏర్పాటుకు ఆమోదం తెలపడం అభినందనీయమని చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ గొండు సీతారాం తెలిపారు. ఈ పరీక్షా కేంద్రం కేజీహెచ్‌లో ఏర్పాటుచేయాలని ఫోరం అల్లూరి జిల్లా శాఖ కన్వీనర్ బాకా లవకుశ ఎప్పటి నుంచో కోరుతున్నారని పేర్కొన్నారు. సభ్యులు సేకరించిన పలు అంశాలు, అక్కడి పిల్లల వ్యాధి తీవ్రత, వ్యాధి నిర్ధారణకు నోచుకోక దీర్ఘకాలికంగా ఇబ్బంది పడుతున్నవారి దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వివిధ రూపాల్లో తీసుకెళ్లామన్నారు. మరో మూడు మాసాల్లో ఏర్పాటు కానున్న ఈ కేంద్రంతో ఏఎస్సార్ జిల్లాతోపాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని సికిల్ సెల్ బాధితులైన లక్షలాది మంది గిరిజన పిల్లలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఫోరం తరఫున ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

స్మార్ట్ స్ట్రక్చర్ రూపకల్పనలో నానో టెక్నాలజీ

మురళీనగర్: కార్బన్ నానోట్యూబ్స్, ఫైబర్ నానో కంపోజిట్స్ వంటి ఆధునిక పదార్థాల వాడకం స్మార్ట్ స్ట్రక్చర్స్ రూపకల్పనలో కీలకమని రాయపూర్ ఎన్ఐటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.సురేష్‌కుమార్ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో గురువారం ఆయన పాల్గొని 'స్మార్ట్ స్ట్రక్చర్స్-ఏ డిజైన్ థింకింగ్ పర్‌స్పెక్టివ్' అనే అంశంపై ప్రసంగించారు. నానో టెక్నాలజీ వల్ల ఉత్పత్తుల పనితీరు, దీర్ఘాయువు, విశ్వసనీయత గణనీయంగా పెరుగుతాయన్నారు. స్మార్ట్ మెటీరియల్స్, సెన్సార్లు ఆధునిక నిర్మాణ పద్ధతుల రూపకల్పనలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నాయని వివరించారు. డిజైన్ థింకింగ్ ద్వారా ఏరోస్పేస్, సివిల్ ఇంజినీరింగ్, బయోమెడికల్ రంగాల్లో వినూత్న పరిష్కారాలను కనుగొనవచ్చని పేర్కొన్నారు.

డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధన

టీసీఎస్ ఫార్మర్ స్ట్రాటజిక్ అడ్వైజర్ డాక్టర్ మోహన్ కంచర్ల 'రీ ఇమాజిన్ టీచింగ్ టు రీఇగ్నైట్ లెర్నింగ్' అనే అంశంపై ప్రసంగించారు. బోధనాభ్యసనలో భాగంగా విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందించాలని సూచించారు. డిజిటల్ లెర్నింగ్, ఇంటరాక్టివ్ పద్ధతులు, డిజైన్ థింకింగ్ ఆధారంగా బోధనను పునర్నిర్మిస్తే విద్యార్థుల ఆసక్తి పెరిగి, స్వయంగా నేర్చుకునేందుకు ఉత్సాహం చూపుతారన్నారు. ఇంజినీరింగ్ విద్యలో ఫ్యాకల్టీ సభ్యులు కొత్త బోధనా పద్ధతులు అవలంబించడం ద్వారా పరిశ్రమ అవసరాలకు సరిపోయే ప్రతిభను విద్యార్థుల్లో పెంపొందించవచ్చన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్, కో-కో ఆర్డినేటర్‌లు డాక్టర్ సీహెచ్.రాజు, ఎం.భరణి పాల్గొన్నారు.

'లులూ భూ కేటాయింపులు ఉపసంహరించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న రాణీశర్మ

అల్లిపురం: ఆర్కే బీచ్‌లో లులూ మాల్‌కు కేటాయించిన సుమారు 14 ఎకరాల భూమిని వెంటనే ఉపసంహరించుకుని, ఆ స్థలంలో సైన్స్ సిటీ నిర్మించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త రాణీశర్మ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జగదాంబ సిటు కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని 'లులూ వద్దు-సైన్స్ సిటీ ముద్దు'అనే నినాదంతో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. 99 ఏళ్లకు విలువైన భూముల్ని నామమాత్రపు రుసుముతో లీజుకు ప్రభుత్వం ఇవ్వడం ఆక్షేపణీయమన్నారు. మూడేళ్లు ఎలాంటి లీజు కూడా చెల్లించాల్సిన అవసరం లేదని జీవో నెం.137లో పేర్కొన్నడం దారుణమన్నారు. లులూకు కేటాయించిన భూమిలో ఆ సంస్థ కొంత భూమిని మరి కొన్ని సంస్థలకు కేటాయించుకోవచ్చని పేర్కొనడం అతి పెద్ద అవినీతి చర్యగా ఆరోపించారు. సెప్టెంబర్ 1న లులూ మాల్ భూ కేటాయింపులకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని, ఆ తర్వాత ప్రజా బ్యాలెట్ నగరంలో విస్తృతంగా నిర్వహిస్తామన్నారు. విశాఖలో ప్రభుత్వ భూముల్ని పెద్ద ఎత్తున ప్రైవేటు సంస్థల ప్రయోజనాలకు కేటాయిస్తున్నారని, ప్రజా ప్రయోజనాలకు భూములు లేని పరిస్థితి సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా వనరుల పరిరక్షణకు చేస్తున్న ఈ ఉద్యమంలో విశాఖ ప్రజలు పాల్గొని, లులూ మాల్ ఒప్పందం రద్దు చేసి, సైన్స్ సిటీ నిర్మించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వద్దామని పిలుపునిచ్చారు. ఈ వేదికకు బి.గంగారావు, క్షేత్రపాల్, వెంకటలక్ష్మిలు కన్వీనర్లుగా నియమితులయ్యారు.

నదుల అనుసంధానంతో దేశం అభివృద్ధి

దీక్ష ప్రారంభించిన సంఘమిత్ర సూరిబాబు



దీక్ష చేస్తున్న సూరిబాబు

బీచ్‌రోడ్డు: దేశంలోని జీవనదులను అనుసంధానం చేస్తే అద్భుతమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా అమెరికాను కూడా అధిగమించవచ్చని సంఘమిత్ర సూరిబాబు అన్నారు. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మూడు రోజుల దీక్షను ఆయన ప్రారంభించారు. బ్రహ్మకుమారి రామేశ్వరి సూరిబాబుకు పూలమాల వేసి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ నాగావళి, సువర్ణముఖి, వేగవతి, గోస్తాని వంటి నదులను అనుసంధానం చేయడం వల్ల ఉత్తరాంధ్ర రైతులు కరువు అనే మాటను పూర్తిగా మర్చిపోతారన్నారు. నీటి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు ఉండవని, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో ఒక కొత్త దశ మొదలవుతుందని చెప్పారు. భారతదేశంలో సహజ వనరులు ఉన్నప్పటికీ, నదుల అనుసంధానం కేవలం రాజకీయ వాగ్దానాలకే పరిమితం కావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు మజ్జి దేవిశ్రీ, ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు సూరప్పడు, తులసి, ఆశ, దుర్గ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదులను ఆహ్వానించకపోవడం ఆక్షేపణీయం'



మాట్లాడుతున్న విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్

విశాఖ-లీగల్: ఈ నెల 15న జిల్లా కోర్టులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవానికి న్యాయవాదులను ఆహ్వానించకపోవడంపై న్యాయవాదులు మండి పడ్డారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం జరిగిన న్యాయవాదులు సర్వసభ్య సమావేశంలో పలువురు మాట్లాడారు. దశాబ్దాల సంప్రదాయాన్ని తోసిపుచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి తక్షణమే న్యాయవాదులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 సందర్భంగా జరిగిన వేడుకల్లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తమను ఆహ్వానించకపోవడంతోపాటు, సంఘ అధ్యక్ష, కార్యదర్శులను కనీసం వేదిక పైకి పిలవలేదన్నారు. అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజుల్లోగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి దీనికి సమాధానం ఇవ్వాలన్నారు. అప్పటి వరకు జిల్లా కోర్టు ఆధ్వర్యంలో జరిగే ఎలాంటి కార్యక్రమాల్లో న్యాయవాదులు పాల్గొనేది లేదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పీఎల్ నాయుడు, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు. ఇదే అంశంపై న్యాయవాదుల సంఘం కూడా ఓ ప్రకటన విడుదల చేసింది.

స్టీల్‌ప్లాంట్‌పై కౌన్సిల్‌లో చర్చించాలి

మేయర్‌ను కోరిన కార్పొరేటర్ గంగారావు

అల్లిపురం : జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో అత్యవసర అజెండాగా విశాఖ స్టీల్‌ప్లాంట్ విభాగాలను ప్రైవేటు వారికి ఇచ్చే నిర్ణయంపై చర్చించాలని 78వ వార్డు కార్పొరేటర్, సీపీఐ(ఎం) ఫ్లోర్ లీడర్ బి.గంగారావు మేయర్‌కు గురువారం లేఖ రాశారు. ఆ లేఖలో ఏముందంటే... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని కీలకమైన 44 విభాగాలను ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పజెప్పాలని టెండర్ల ప్రక్రియ ప్రారంభించిందని, ఈ చర్య అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్లాంట్‌లోని జనరల్ హాస్పిటల్, టౌన్ అడ్మిన్ వంటి విభాగాలను కూడా ప్రైవేటు వారికి అప్పగిస్తున్నారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ముక్కలు చేసి దొడ్డి దారిన ప్రైవేట్ వారికి కట్టబెట్టే చర్యల్లో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రైవేటీకరణలో భాగంగానే ఇటీవల 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. వీరిలో అత్యధిక మంది స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూములు త్యాగం చేసిన నిర్వాసిత కుటుంబాల కార్మికులేనని ఆవేదన వ్యక్తం చేశారు. 1200 మంది పర్మినెంట్ కార్మికులను కూడా తొలగించారన్నారు. ఇప్పుడు తీసుకోబోతున్న ప్లాంట్ విభాగాల ప్రైవేటీకరణ వల్ల ఆపరేషన్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇతర కార్యకలాపాలన్నీ కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గతంలో జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణను అడ్డుకోవాలని కోరారు. విభాగాల ప్రైవేటీకరణ, కార్మికుల తొలగింపు వంటి చర్యలను ఉపసంహరించేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే అక్రమంగా తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకునేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను మన కౌన్సిల్ కోరాలన్నారు. అందుకు శుక్రవారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో అత్యవసర అజెండాగా చర్చించాలని ఆయన మేయర్‌ను కోరారు.

జూ పార్కుకు ఐవోబీ వితరణ



జూలో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలను ప్రారంభిస్తున్న రవికుమార్ గుప్తా, మంగమ్మ

ఆరిలోవ : ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ) కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కుకు సహకారం అందించింది. ఇందులో భాగంగా సందర్శకుల సౌలభ్యం కోసం జూలో 25 సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేసింది. ఈ బెంచీలను గురువారం ఐవోబీ రీజినల్ మేనేజర్ రవికుమార్ గుప్తా, జూ క్యూరేటర్ జి.మంగమ్మ ప్రారంభించారు. ఆ బెంచీలను జూలో పలుచోట్ల సందర్శకులకు వీలుగా ఉండేవిధంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూ క్యూరేటర్ ఐవోబీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐవోబీ చీఫ్ మేనేజర్ డి.శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల అధికారులు సుష్మా, కె.మురళి, పి.శ్రీనివాసరావు, జూ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.ఉమాదేవి, అసిస్టెంట్ క్యూరేటర్ బి.గోపి, సీనియర్ అకౌంటెంట్ కె.సన్యాసినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.